ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల పట్టాలు పంపిణీ

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇళ్లకు వెళ్లినపుడు దళితవాడ ప్రజలు కోరిన మేరకు ఇళ్ల స్థలాలు పట్టాలు లబ్ధిదారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం గుడివాడ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పలు పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. దళితవాడలో రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన, యాదవపాలెంలో రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాల్, హిందూ శ్మశానవాటికకు రూ.6 లక్షలతో అభివృద్ధికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దళితవాడలో సిమెంట్ రోడ్డును ఎంపీపీ శ్రీనివాసరావు, సర్పంచ్ యడ్లపాటి రాకేష్‌లు ప్రారంభించారు. అనంతరం గంగాపార్వతి సమేత నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో దాతలు పోతురాజు శివరామకృష్ణ, శివకుమారి దంపతులు సహకారంతో విజయగణపతి విగ్రహ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం చినదళితవాడలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న పట్టాలు పంపిణీ తమ హయాంతో లబ్ధిదారులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఒక అవకాశం ఇవ్వమని కోరగా ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. గ్రామంలో మూడేళ్ళ కాలంలో వివిధ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.8.77 కోట్లు జమ చేశామన్నారు. ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తున్న వారి కల నెరవేరిందన్నారు. జగనన్న కాలనీల్లో 120 మందికి నివేశనా స్థలాలు పంపిణీ చేశామన్నారు. తహసీల్దార్ కె.రవిబాబు, సర్పంచ్ రాకేష్, ఎంపీడీఓ ఎల్.విజయాలక్ష్మణ్, ఎస్సీసెల్ అధ్యక్షులు కె.రాజమోహన్, పీఆర్‌ఏఈ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కడియాల శివరామబ్రహ్మం, బురదగుంట రమేష్, బండికళ్ళ సతీష్, మత్తే ధన కిషోర్, రుద్రపాటి మోషె, పిల్లి రాజు, బుచ్చయ్య పాల్గొన్నారు.

డ్రైడేను సమర్థంగా నిర్వహించండి

ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ హనుమంతరావు



ర్యాలీలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ హనుమంతరావు, చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్

తెనాలిఅర్బన్: డ్రైడే కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా భావించి అందరూ సమర్థవంతంగా నిర్వహించాలని ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.హనుమంతరావు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారాన్ని ప్రతి ఒక్కరూ డ్రైడేగా నిర్వహించాలని సూచించారు. ఇలా చేయడం వల్ల వ్యాధులు దరిచేరవని చెప్పారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమల వ్యాప్తి పెరిగి మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడు వాపు వ్యాధి వంటివి ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ దీనిలో భాగస్వాములు కావాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే వారానికి ఒక రోజు ఇంటి పరిసరాల్లో ఉన్న నీటిని బయటకు పంపే విధంగా చూడాలని చెప్పారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ ఇళ్లలో ఉండే కూలర్లు, ఫ్రీజులు, గాబులు, తదితర వస్తువులను వారానికి ఒక రోజు శుభ్రం చేసి ఎండబెట్టాలని సూచించారు. ఇంటి పరిసరప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, తెనాలి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి కంఠా ఉమాకాంత్, మలేరియా, సచివాలయ, ఫైలేరియా సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

13న తెనాలిలో అప్రంటీస్ మేళా

తెనాలిఅర్బన్: అప్రంటీస్ మేళాను ఈ నెల 13న తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ సీహెచ్.ఎస్.వి.ప్రసాద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటల నుంచి మేళా ప్రారంభమవుతుందని చెప్పారు. సుమారు 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో అన్ని ట్రేడ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హత, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని మేళాకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్ నెం.99598 28100లో సంప్రదించాలన్నారు.

విద్యుత్ చౌర్యం సామాజిక నేరం



తెనాలిటౌన్: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, అందుకు కఠిన చర్యలు తప్పవని ఎపిసిపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వివి చిరంజీవి తెలిపారు. తెనాలి రూరల్ మండల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. 68 బృందాలుగా అధికారులు, సిబ్బంది ఏర్పడి గృహాల్లో దొంగతనం కేసులు, అదనపు లోడు కేసులు తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం ఈఈ చిరంజీవి వివరాలు తెలిపారు. అదనపు లోడు కేసులు 138 కాగా దీనికి అపరాధ రుసుము రూ.5,71,000 లు, దొంగతం కేసులు మూడు కాగా అపరాధ రుసుము రూ.1,80,000 లు, మ్యాల్ప్రాక్టీస్ కేసులు ఒకటి కాగా అపరాధ రుసుము రూ.ఐదువేలు విధించినట్లు తెలిపారు.

తబల విద్వాంసులు సాంబశివారెడ్డికి సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం కదలడు వదలడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం ప్రముఖ తబల విద్వాంసులు వారే సాంబశివారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంచర్ల ఏడుకొండలు, కఠారి శేషాగిరి, మైనేని నాగభూషణం, గుమ్మడి ప్రసాద్, కృష్ణ ప్రసాద్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ఈదర శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కొల్లూరు : ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలోని కోటిపల్లిలో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీసులు అతని మృతదేహాన్ని వెలికితీశారు. ఏఎస్‌ఐ రామయ్య వివరాల మేరకు.. కోటిపల్లి కొత్త సంఘానికి చెందిన కాలం బుచ్చిబాబు ఉరఫ్ వెంకటప్పయ్య (38) ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్తున్నట్లు తన తల్లికి చెప్పి.. తిరిగి రాలేదు. మతిస్థిమితం అంతంతమాత్రంగా ఉన్న అతను పుట్టింటికి వెళ్లిన తన భార్య వద్దకు వెళ్లి ఉండవచ్చునని బంధువులు భావించారు. ఈ నేపథ్యంలో ఉదయం స్థానిక చెరువులో ఒక మృతదేహం తేలడంతో గమనించిన స్థానికులు కొల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పరిశీలించగా, కనిపించకుండా పోయిన బుచ్చిబాబుగా గుర్తించారు. మృతుడు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి, ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చునన్న అనుమానం వ్యక్తమవుతోంది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



రేపల్లె: రబీ సీజన్‌లో రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని మండల ఏఓ విజయ్‌బాబు చెప్పారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయశాఖ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రబీలో సస్యరక్షణ, సాగు ప్రణాళిక, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ ఈ నెల 10వ తేదీలోపు రైతులు చేయించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. రబీకి అవసరమయ్యే ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో పుష్కలంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వీఏఏలు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపల్ సత్యబాబు హఠాన్మరణం



పొణుకుమాటి సత్యబాబు

తెనాలి: పట్టణానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపల్, సమాజ సేవకుడు పొణుకుమాటి సత్యబాబు (62) హఠాన్మరణం చెందారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని స్వగృహంలో శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటురాగా, కుటుంబ సభ్యులు గమనించి, ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందారు. తాలూకా జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా ఏడాదిన్నర క్రితం పదవీ విరమణ చేశారు. అధ్యాపకుడిగా, ప్రిన్సిపల్‌గానే కాకుండా ఉచిత బ్రాహ్మణ వివాహ వేదిక సంస్థ కార్యదర్శిగా గత మూడున్నర దశాబ్దాలుగా బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఎన్నో వివాహాలకు కారకులయ్యారు. నాయుడమ్మ ట్రస్ట్ వ్యవస్థాపకుడైన పట్టణ ప్రముఖుడు పి.విష్ణుమూర్తికి సోదరుడు సత్యబాబు. నాయుడమ్మ అవార్డును ప్రదానం చేసిన సభకు సత్యబాబు, ఆయన సోదరీమణులు ఎంతగానో తోడ్పాటునందించేవారు. కొన్నేళ్ల క్రితం విష్ణుమూర్తి మృతితో నాయుడమ్మ అవార్డు ప్రదానం నిలిచిపోయింది. ఇటీవలే సత్యబాబు, ఆయన సోదరిలు పూనుకుని, నాయుడమ్మ ట్రస్ట్‌ను చెన్నైలోని సీఎల్‌ఆర్ఐ సంస్థకు అప్పగించారు. లాంఛనంగా సభ నిర్వహణకు సన్నాహాల్లో ఉండగానే సత్యబాబు మృతిచెంది, అందరినీ విషాదంలో ముంచారు. నాయుడమ్మ ట్రస్ట్ సభ్యుడు సూరెడ్డి సూర్యమోహన్, బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక అధ్యక్షుడు టి.దక్షిణామూర్తి, కోశాధికారి ఆర్.రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శి పూర్ణభాస్కర్, వేదిక బ్రాహ్మణ సేవాసమాఖ్య అధ్యక్షుడు అమ్మణి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి టి.సూరిబాబు, ఉపాధ్యక్షుడు భాగవతుల కామేశ్వరరావు, అధ్యాపకులు సుధాకరరెడ్డి, వెంకటరత్నం, నరసింహమూర్తి, కిరణ్, జూటూరి సత్యనారాయణమూర్తి, నల్లూరి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ పరిషత్ నాయకుడు వంగల మాధవరావు, రోటరీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ గుత్తా వెంకటరత్నం నివాళులర్పించినవారిలో ఉన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: కాళీమాత దేవస్థాన కమిటీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల రెండోవ శుక్రవారం దేవస్థానం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యర్రా శ్రీనివాసరావు, కందెపి సీతారామయ్య, నక్కా వెంకటేశ్వర్లు, మదన్, తదితరులు పాల్గొన్నారు.

జూదరులు అరెస్ట్

తెనాలిరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి జూదరులను అరెస్ట్ చేశారు. పట్టణ చెంచుపేట కోనేరు బజారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 4010 స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

తెనాలిరూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను దూషించి, ఆ వీడియోను సోషల్ మీడియాలో పెట్టిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన హమారా ప్రసాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అసభ్యంగా దూషిస్తున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనిపై అందించిన ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ సీఐ యు. శ్రీనివాసులు శుక్రవారం రాత్రి తెలిపారు.

కాలువ ఆక్రమణలపై విచారణ



కర్లపాలెం: పంట కాలువపై ఆక్రమణలు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ ఉదయభాస్కర్ తెలిపారు. నల్లమోతువారిపాలెం ఎత్తిపోతల కాలువ ఆక్రమణకు గురవుతుందని ఎంవీ రాజుపాలెం గ్రామానికి చెందిన ఆట్ల బాలాజీరెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం డీఈ ఉదయభాస్కర్, ఏఈ శ్రీనివాసరావు లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని పంట కాలువను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కేశవనారాయణరావును కలసి ఇరిగేషన్ కాలువ సర్వే నిర్వహించి, ఆక్రమణలు గుర్తించి, తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలువలను ఆక్రమిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పంచముఖి గాయత్రి దివ్యక్షేత్ర ప్రతిష్ఠమహోత్సవం



పూజలు చేస్తున్న ఆలయ పాలకవర్గ సభ్యులు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని గాయత్రి నగర్‌లో ఉన్న శ్రీ పంచముఖ గాయత్రి ద్వాదశ జ్యోతిర్లింగ దివ్య క్షేత్రం సప్తమి వార్షిక ప్రతిష్ఠమహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌లకు పరిమల సుగంధ మంగళ ద్రవ్యములు, పంచామృతములతో అర్చకులు దిలీప్‌కుమార్ శర్మ, అరుణకుమార్‌లు అభిషేకములు చేశారు. ఉదయం గాయత్రి మహాయజ్ఞము నిర్వహించారు. అనంతరం 9.30గంటలకు శివ పార్వతుల కల్యాణ మహోత్సవము జి.వి.రావు, బాలత్రిపుర సుందరి దంపతులు (హైదరాబాద్) జరిపారు. దేవతామూర్తులకు అభిషేకము చేశారు. అర్చకులు దండిబొట్ల సుబ్రమణ్యమూర్తి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వగాయత్రి చారిటబుల్‌ట్రస్ట్ పాలకవర్గ శాశ్వత అధ్యక్షులు నంబూరు కృష్ణమూర్తి, వ్యవస్థాపకధర్మకర్త నాగం నాగేంద్రరావు, కార్యదర్శి యర్రంశెట్టి హనుమంతరావు, కోశాధికారి వెలివెల రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు కల్యాణం రామపుల్లయ్య, సంయుక్త కార్యదర్శి జొన్నాదుల వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు లోకం వెంకటేశ్వరరావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, గొడవర్తి సాయిహరేరామ్, పురంశెట్టి ఆంజనేయులు, శాశ్వత పారంపర్య ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వెస్ట్‌బెర్రీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, పీఈటీలు

తెనాలిటౌన్: మహారాష్ట్ర రాష్ట్రంలోని షిరిడిలో ఈ నెల 3 నుంచి 5వరకు సమత ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన జాతీయ స్థాయి జంప్‌రోప్ చాంపిఎన్ షిప్ పోటీల్లో వెస్ట్‌బెర్రీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు స్కూల్ ప్రిన్సిపల్ కె.శేషులత తెలిపారు. ఎస్.ఆర్. స్పీడ్ రిలే 4''30 సెకండ్ల కేటగిరిలో వి.మోక్షిత్, జి.యశ్వంత్(6వతరగతి), వి.గీతారామ్ (8వతరగతి), ఎం.వెంకట కార్తీక్ (7వ తరగతి)లు రజత పతకాన్ని సాధించారు. స్పీడ్ ఎడ్యూరెన్స్ 1''20 సెండర్ల విభాగంలో కె.ముక్త శ్రీ కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు త్వరలో బూటాన్‌లో జరుగబోయే అంతర్జాతీయ జంప్‌రోప్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అలాగే వి.పూజిత (4వ తరగతి), దీవెన (7వ తరగతి), వెంకట సాయి ధీరజ్ (8వ తరగతి), లలిత సుహాస్ (9వ తరగతి)లు జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. పతకాలు సాధించి విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జి.రత్నకుమారి, ఆర్.నరేష్, జి.సుబ్రమణ్యంలను ఉపాధ్యాయులు అభినందించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: రూరల్ మండలం గుడివాడ గ్రామంలో సచివాలయంలో శుక్రవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులచే చేయిస్తున్న ప్రతిజ్ఞలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, తహసీల్దార్ కె.రవిబాబులు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్.వి.సుబ్బారావు కుష్ఠు వ్యాధి గురించి అవగాహన కల్పించి నివారణ మార్గాలను సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, డిపిఎం శ్యామ్, హెచ్‌ఈఓ నాగరాజు, సూపర్‌వైజర్లు జి.శ్రీనివాసరావు, లక్ష్మీప్రసన్న, ఎఎన్ఎం చంపావల్లిరి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లిపర: మానవ శరీరంపై ఎర్రటి రాగి వర్ణం కలిగిన మచ్చలు ఉండి ఆప్రదేశంలో స్పర్శలేనట్లయితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో గ్రామైఖ్యసంఘప్రతినిధులు, యానిమేటర్స్‌లకు మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షతగా మండల లెప్రోసినోడల్ అధికారి అందెబాల చంద్రమౌళి వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సమాజంలో ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి అందరికీ తెలియజేయాలని అన్నారు. కుష్ఠు వ్యాధి గురించి వివరించారు. తొలుత కుకుష్ఠువ్యాధితో పోరాడుదాం , కుకుష్ఠువ్యాధినిగత చరిత్రగా మార్చేద్దాం అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులురాలు తమ్మా సుజాత, ఎపీఎం దన్నవరపు బసవప్రియసదర్శిని, హౌసింగ్ ఏఈ వి సుబ్బారావు, ఆర్డబ్ల్యూఎస్ఏఈ ఆర్ సుదాకర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామైక్యసంఘ ప్రతినిధులు, యానియేటర్స్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడుబండ్లు పంపిణీ



తోపుడుబండ్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తెనాలిటౌన్: చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అద్దె భారం పడకుండా ఉండేందుకు సొంత బండ్లను సమకూర్చాలనే ఉద్దేశ్యంతో రోటరీక్లబ్ సభ్యుల సహకారంతో తోపుడు బండ్లను అందజేస్తున్న క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ గుత్తా వెంకటరత్నం తెలిపారు. తెనాలి బస్టాండ్ సమీపంలోని ఈగల్ రెస్టారెంట్ వద్ద శుక్రవారం రోటరీక్లబ్ ఆఫ్ హైదరాబాద్ డక్కన్, రోటరీ క్లబ్ మంగళగిరి సంయుక్తంగా నిర్వహించే 'డేర్' ప్రాజెక్ట్‌లో భాగంగా తోపుడు బండ్లను చిరు వ్యాపారులకు అందజేశారు. ఒక్కొక్క బండి రూ.14వేలు వంతున 200 తోపుడు బండ్లను రూ.28 లక్షల వ్యయంతో వివిధ రోటరీ క్లబ్‌ల సహకారంతో రోటరీ జిల్లా 3150 తరఫున ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. పూర్వపు గుంటూరు, ప్రకాశంజిల్లాల పరిధిలో 130 మరియు తెలంగాణలో 70 బండ్లు చిరు వ్యాపారులకు అందిస్తున్నట్లు వెంకటరత్నం తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఈదర్ వెంకటపూర్ణచంద్, డాక్టర ధూళిపాళ్ళ రవీంద్రనాథ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా బాలకోటయ్య తిరునాళ్లు నిర్వహించాలి



తిరునాళ్ల నిర్వహణపై సమీక్షిస్తున్నతహసీల్దార్ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: అరవపల్లి బాలకోటయ్య తిరునాళ్లు వైభవంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని తహసీల్దార్ డి.మల్లికార్జునరావు సూచించారు. మహా శివరాత్రి తిరునాళ్లపై బాలకోటేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు త్వరితగతిన కల్పించాలన్నారు. పొంగళ్లు పెట్టుకునేందుకు, తల నీలాలు సమర్పించేందుకు ప్రత్యేక స్థలాలు కేటాయించాలని నిర్దేశించారు. పొరుగు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఆలయ ఆవరణలో ఎటువంటి అపశృతులు తలెత్తకుండా పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. వైద్య, పశు సంవర్థక, అగ్నిమాపక, విద్యుత్ అధికారుల బృందాలు నిరంతరం తిరునాళ్లల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్టీసీ అధికారులు బస్సులను నిలుపుదల చేసుకునేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని చెప్పారు.కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కర్లపాలెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల సెబ్ సీఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. కర్లపాలేనికి చెందిన కాటూరి రాములు మద్యం సీసాలు అమ్ముతున్నాడని సమాచారం అందడంతో.. తమ సిబ్బందితో దాడిచేసి అతని వద్ద ఉన్న 9 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అతనిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని వెల్లడించారు.

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన



హరిద్ర శృంగార్చన పూజలో పాల్గొన్న భక్తులు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం 46వ హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడారు. బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగ పిల్లలకు శీఘ్రంగా వివాహం అయ్యేందుకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

అలనాటి మధుర స్మృతులు.. గుర్తుకొచ్చాయి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టస్ సంస్థ అధినేత రామకృష్ణ

చెరుకుపల్లి: వివిధ రంగాల్లో స్థిరపడిన చిన్న నాటి మిత్రులు చదువులమ్మ ఒడికి చేరుకొన్నారు. ఎంతో సంతోషంతో ఒకరినొకరు పలుకరించుకొని కుశల ప్రశ్నలు వేసుకొన్నారు. అలనాటి మధుర స్మృతులను నెమరువేసుకోన్నారు. మండలంలోని కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ఘనంగా జరిగింది. కళాశాలలో 1969 నుంచి 2023 సంవత్సరం వరకు చదువుకున్న విద్యార్థులంతా.. వందల సంఖ్యలో ఒకే వేదికపై ఒక్కటయ్యారు. ప్రాంగణంలో ఉన్న కళాశాల వ్యవస్థాపకులు తుమ్మల సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టస్ సంస్థ అధినేత తుమ్మల రామకృష్ణ, మహారాష్ట్ర మాజీ డీజీపీ దేవరపల్లి కనకరత్నం, గడ్డిపాటి వాసు, కిలారి మనోహర్, పిట్టు శ్రీనివాసరెడ్డి, రావూరి ఆంజనేయులు, బొనిగల విజయ్‌కుమార్, దివి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ

ప్యాపర్రు(వేమూరు): వృద్ధులకు ఉచితంగా ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో కళ్లజోళ్లు అందించినట్లు మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామంలో శుక్రవారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి సమస్య ఉన్న వృద్ధులకు కళ్ల జోళ్లు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొరటా లీలా సత్యసాయి, సజ్జ శ్రీరామ మూర్తి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రేపల్లె: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిచంద్ర పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ రేపల్లె బ్రాంచి ఆధ్వర్యంలో పట్టణంలోని కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రమాదాలు, కాన్పుల సమయంలో గర్భిణులకు రక్తం అత్యవసరమన్నారు. శిబిరంలో 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.